క్లుప్తంగా

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన


అవగాహనలో పాల్గొన్న కేజీబీవీ విద్యార్థినులు

రాయదుర్గంటౌన్: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వాల్మీకినగర్‌లోని కేజీబీవీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు బాల్య వివాహాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు అవగాహన లోపంతో కొన్ని సమస్యలు తలెత్తుతాయన్నారు. చదువుతో పాటు పరిశుభ్రత, పౌష్టికాహారంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో బాల్య వివాహాలను ప్రోత్సహించరాదన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే పోలీసులకు, ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులకు సమాచారం అందజేయాలన్నారు.

'మీ సేవ' కేంద్రాల తనిఖీ


మీ సేవ కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ శంకర్

కళ్యాణదుర్గం: మండలంలోని గరుడాపురం, బ్యాద్రహళ్లి, గోళ్ల పంచాయతీల్లోని మీ సేవా కేంద్రాలను డీఎల్‌డీఓ శంకర్ మంగళవారం తనిఖీ చేశారు.ఆయా కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన కేంద్రాలలో లబ్ధిదారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సర్టిఫికెట్ల జారీపై వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న మొత్తం తదితర సౌకర్యాలపై పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా రుసుం వసూళ్లు చేస్తే అలాంటి మీ సేవా కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చురుగ్గా మరుట్ల తారు రోడ్డు పనులు


అంతరగంగ వద్ద తారు రోడ్డు వేసిన దృశ్యం

కూడేరు: కూడేరు నుంచి మరుట్లకు రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కూడేరు నుంచి మరుట్ల సుమారు 16 కిలో మీటర్లు ఉంటుంది. కూడేరు నుంచి అంతరగంగ, ఇప్పేరు, కలగళ్ల గ్రామాల మీదుగా మరుట్ల వెళ్లాల్సి ఉంటుంది. రూ.6.4 కోట్లతో తారు రోడ్డు నిర్మిస్తున్నారు. ఇప్పటికే కూడేరులో కలగళ్ల రోడ్డు క్రాస్ నుంచి సంగమేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారి వరకు సిమెంట్ నిర్మాణం పూర్తయ్యింది. మూడు రోజులు నుంచి అంతరగంగ వరకు తారు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇప్పేరు నుంచి తారు రోడ్డు నిర్మాణపు పనులు చేపట్టాల్సి ఉంది. మరట్ల రోడ్డు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా ఉండేది. విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, వైఎస్సార్ సీపీ నేతలు పలుమార్లు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకు విశ్వేశ్వర రెడ్డి కృషి చేశారు.

గ్రామాల్లో గొడవలకు తావివ్వొద్దు


పెద్దకొట్టాలపల్లిలో మాట్లాడుతున్న అధికారులు

విడపనకల్లు: గ్రామాల్లో గొడవలకు తావివ్వొద్దని, ప్రజలంతా ప్రశాంత జీవనం సాగించాలని తహసీల్దార్ దస్తగిరి, ఎస్‌ఐ ఖాజా హుసేన్ సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దకొట్టాలపల్లిలో అధికారులు పర్యటించారు. ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న అల్లర్లపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎవరైనా గొడవలు పడినా, అల్లర్లు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చట్టాలపైన అవగాహన కల్పించారు.

జగనన్న మరోసారి సీఎం కావాలని పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: జగనన్న మరోసారి సీఎం కావాలని, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా తలారి రంగయ్య అత్యధిక మెజార్టీతో గెలవాలని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు టైలర్ శీన, దొడగట్ట సూరి, బోరంపల్లి రామిరెడ్డి, తదితరులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.

విత్తనం సిద్ధం.. సాగుకు సన్నద్ధం


బ్రహ్మసముద్రం మండలం పాల వెంకటాపురంలో సబ్సిడీ విత్తన రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం


జుంజురాంపల్లి ఆర్బీకే కి చేరిన విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న రైతులు

- ఖరీఫ్ విత్తన పంపిణీకి అధికారుల సన్నాహాలు
- గోదాములకు చేరుతున్న విత్తన వేరుశనగ
- ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరం

ఉరవకొండ/రాయదుర్గం రూరల్/కళ్యాణదుర్గం : ఓ వైపు మే నెలలో మండే ఎండలు.. మరోవైపు ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. ఇటీవల నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు ముంగారు సేద్యాల్లో తలమునకలయ్యారు. పొలాల్లో ఎరువులు చల్లుకొని, దుక్కులు చేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. రైతులకు అవసరమైన విత్తన వేరుశనగను వ్యవసాయ అధికారులు ఇప్పటికే సిద్ధం చేస్తున్నారు. ఆర్‌బీకేల్లో విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరం చేశారు. నియోజకవర్గాల వారీగా విత్తన వేరుశనగ కోసం ప్రతిపాదనలు పంపగా, ఇప్పటికే స్టాకు గోదాములకు చేరుతోంది.

కళ్యాణదుర్గం నియోజకవర్గానికి ఈ సారి ఖరీఫ్‌కు 20 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగకు అధికారులు ప్రతిపాదనలు పంపగా ఇప్పటికే 700 క్వింటాళ్లు నియోజకవర్గ కేంద్రం గోదాములకు వచ్చి చేరింది. ఉరవకొండ నియోజకవర్గానికి మొత్తం12,800 క్వింటాళ్లు ప్రతిపాదనలు పంపగా, ఇప్పటికే 2550 క్వింటాళ్లు గోదాములకు చేరింది. రాయదుర్గం నియోజకవర్గానికి మొత్తం 14,150 క్వింటాళ్లు కేటాయించగా, ఇప్పటికే 5,050 క్వింటాళ్ల వేరుశనగ గోదాములకు చేరింది.

కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ...

ఖరీఫ్ రాయితీ విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ఆయా గ్రామ ఆర్‌బీకే కేంద్రాల్లో అధికారులు ప్రారంభించారు. రైతుల వద్ద నుంచి రాయితీ నగదును తీసుకొని విత్తన వేరుశనగకు విత్తన కూపన్లను అందజేస్తున్నారు. ఆయా మండలాలకు పూర్తి స్థాయిలో విత్తన వేరుశనగ చేరగానే ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేపట్టేందుకు అధికారులు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ప్రతిపాదనలు పంపిన విత్తన వేరుశనగ, సరఫరా అయిన వేరుశనగ వివరాలు ఇలా..

త్వరలో విత్తన పంపిణీ చేపడుతాం



ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన రాయితీ విత్తన వేరుశనగను రైతులకు త్వరలోనే పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆయా ఆర్‌బీకేల ద్వారా విత్తన రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. పూర్తి స్థాయిలో గోదాములకు విత్తనాలు చేరగానే రైతులకు అందజేస్తాం.

– యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం, రాయదుర్గం,ఉరవకొండ నియోజకవర్గాల్లో విత్తనకాయల ప్రతిపాదనలు ఇలా...

మండలం	వేరుశనగ క్వింటాళ్లలో
కళ్యాణదుర్గం	4,400
బ్రహ్మసముద్రం	4,400
కంబదూరు	3,000
కుందుర్పి	3,900
శెట్టూరు	4,300
మొత్తం	20,000
ఉరవకొండ	3,000
కూడేరు	2,000
బెళుగుప్ప	3,000
వజ్రకరూరు	3,800
విడపనకల్లు	1,000
మొత్తం	12,800
రాయదుర్గం	4,000
గుమ్మఘట్ట	4,500
డి.హీరేహాళ్	2,200
బొమ్మనహాళ్	750
కణేకల్లు	2,700
మొత్తం	14,150

సబ్సిడీ ధరలు ఇలా (కే6 రకం)

పరిమాణం	బస్తాలు	పూర్తిధర	సబ్సిడీ	నికర ధర
30 కేజీలు	1	రూ.2,850	రూ.1,140	రూ.1,710
60 కేజీలు	2	రూ.5,700	రూ.2,280	రూ.3,420
90 కేజీలు	3	రూ.8,550	రూ.3,420	రూ.5,130

కదిరి లేపాక్షి వేరుశనగ రకం ధరలు

పరిమాణం	బస్తాలు	పూర్తిధర	సబ్సిడీ	నికర ధర
30 కేజీలు	1	రూ.2,610	రూ.1,044	రూ.1,566
60 కేజీలు	2	రూ.5,220	రూ.2,088	రూ.3,132
90 కేజీలు	3	రూ.7,830	రూ.3,132	రూ.4,698

ఉచిత పాఠ్య పుస్తకాలు సరఫరా


కూడేరు ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

కూడేరు: 2024–25 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించే పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు మంగళవారం కూడేరుకు చేరాయి. వాటిని కూడేరులోని ఎమ్మార్సీలో నిల్వ ఉంచారు. సుమారు 20 వేల వరకు పాఠ్య పుస్తకాలు సరఫరా కావాల్సి ఉండగా, తొలి విడతలో వివిధ తరగతులకు సంబంధించి 8,877 పాఠ్య పుస్తకాలు సరఫరా అయినట్లు ఎమ్మార్సీ సిబ్బంది తెలిపారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పార్వతీనగర్‌లో సోమవారం రాత్రి ఈదురు గాలికి రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వెంటనే అప్రమత్తమయిన విద్యుత్ అధికారులు.. విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మంగళవారం ఉదయం స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో (మెకానికల్ విభాగం) ఫైనలియర్ విద్యార్థులకు 'మస్నాచు సిమిచు' కంపెనీలో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ అందించనున్నారు. ఇంటర్న్‌షిప్ కాలంలో నెలకు రూ.18,000 స్టైఫండ్, ఉచిత బోధన, రవాణ సౌకర్యం, ఉచిత బీమా, యూనిఫాం అందిస్తారని ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి


తులసీ అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి


లక్ష తులసీ అర్చన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం పరిధిలో వెలిసిన విప్రమలై లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకలను ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య స్వామి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, బలిహరణ నైవేద్యం పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష తులసీ అర్చన, శాంతహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష తులసీ వేడుకలకు భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బుధవారం స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు రామ్మూర్తి స్వామీజీ తెలిపారు.

వర్షంతో పత్తి పంటకు దెబ్బ


పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

బొమ్మనహాళ్: మండలంలో రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో పత్తి పంట దెబ్బతింటుందని రైతులు చెప్తున్నారు. ఆది, సోమవారం రెండురోజుల పాటు వర్షం పడింది. దీంతో పత్తి పంటలకు తేమ శాతం ఎక్కువై, పత్తిమొక్కలు కుళ్లిపోయే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. సోమవారం రాత్రి 13.10 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్, శ్రీరంగాపురం క్యాంపు తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం పడింది.

భక్తిశ్రద్ధలతో నరసింహ జయంతి



నరసింహస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు, కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నరసింహస్వామి జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. స్థానిక పాతూరులోని వ్యాసరాజ మఠం (చిన్నాంజనేయ స్వామి ఆలయం)లో ఉదయం వివిధ దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకార సేవలు నయనానందకరంగా నిర్వహించారు. అనంతరం మన్యుసూక్త హోమాన్ని రుత్వికులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి కల్యాణోత్సవం జరిపించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా సాగిన కల్యాణంలో వివిధ మఠాల ప్రతినిధులు, భారీగా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సా యంత్రం ఉత్సవ మూర్తులతో నగరోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వస్తివచనం, మహామంగళహారతి జరిగాయి. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రఘునాథ్, నాగరాజు, హరినారాయణ పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి


ఆమిదాల్యలలోని ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ఉరవకొండ: ఖరీఫ్ సీజన్ కోసం సమాయత్తం అవుతున్న రైతులు విత్తన కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి శుభకర్ తెలిపారు. రైతులు మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఏ సీజన్‌లో అయినా జాగ్రత్తలు పాటిస్తే మోసపోవాల్సిన అవసరం ఉండదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎరువులు, సస్యరక్షణ మందులు కొనుగోలులో పాటించాల్సిన విషయాలపై ఆయన రైతులకు సూచనలు,సలహాలు ఇచ్చారు.

సంరక్షణ మందులు కొనగోలు ఇలా..

ప్రభుత్వ గుర్తింపు పొందిన తయారీ సంస్థల ఎరువుల బస్తాలను మాత్రమే కొనుగోలు చేయాలి. ఏ వివరాలు లేని సంచులలో ఇచ్చే ఎరువులను ఎట్టి పరిస్థితుల్లో కొనరాదు. కొనుగోలు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. సంరక్షణ మందులు కొనుగోలు చేసే చేసేటప్పుడు సీలు సరిగా ఉన్న డబ్బాలు, సీసాలు చూసి, రశీదుతో పాటు కొనాలి. ఐఎస్ఐ ముద్ర ఉన్న వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. ముందుగా ప్యాక్‌పై మందులు తయారీ చేసిన తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా ఉండాల్సిందే. అలా ఉంటేనే రైతులు ఆ మందులను వాడాలి. మోసపూరిత మాటలు నమ్మి రైతులు మందులను తెలియని వారి వద్ద కొనుగోలు చేయరాదు. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సు ఇవ్వబడిన డీలర్ వద్దనే విత్తనాలు, ఎరువులు, సస్యరక్షణ మందులు కొనుగోలు చేయాలి. ఎండోసల్ఫాన్, బీహెచ్‌సీ 10శాతం. ఇథైల్ పేరాధ్యాన్ రకాల పురుగు మందులను మార్కెట్‌లో విక్రయించినా, కొనుగోలు చేయరాదు.

కొనుగోళ్లలో తీసుకోవాల్సి జాగ్రత్తలు..

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన విత్తన దుకాణ డీలరు లేదా ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సంస్థల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తన సంచిపై లాట్ నంబరు, కాలపరిమితి చూసి విత్తనాలు కొనాలి. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి.
- రైతు కొనుగోలు చేసిన విత్తనాల సంచులు, ట్యాగ్‌లు రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలి.
- విత్తే ముందు రైతు విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించి, విత్తుకోవాలి. దీనివల్ల సమయం ఆదా అవుతుంది.
- ముఖ్యంగా బిల్లు, ఖాళీ సంచి ఉంటేనే విత్తనం నాశిరకం అని సాగులో తెలిస్తే నష్టపరిహారాన్ని ఆయా కంపెనీల నుంచి ఇప్పించేందుకు అవకాశం ఉంటుంది.

కానిస్టేబుల్ దాడిలో యువకుడికి గాయాలు


చికిత్స పొందుతున్న అశోక్

కళ్యాణదుర్గం రూరల్: కొత్తూరుకు చెందిన అశోక్ అనే యువకుడిని కానిస్టేబుల్ చెన్నకేశవులు దాడి చేసి, గాయపరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. వివరాలు.. గ్రామానికి చెందిన అశోక్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, తనిఖీల్లో భాగంగా కానిస్టేబుల్ వాహన రికార్డులు అడిగాడు. రికార్డులు పోలీసులకు చూపించిన అశోక్.. తాను త్వరగా వెళ్లాలని చెప్పడంతో కానిస్టేబుల్ అతనిపై దురుసుగా ప్రవర్తించి, తీవ్రంగా కొట్టాడు. ఈ దాడిలో అశోక్ చేయి విరిగింది. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ప్రత్యేక అవసరాల పిల్లలను బడుల్లో చేర్చాలి

- జిల్లా సహిత విద్య అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్యామ


మాట్లాడుతున్న జిల్లా సహిత విద్య అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్యామ

కూడేరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు బడుల్లో, భవిత కేంద్రాల్లో చేరిస్తే, అనేక ప్రయోజనాలుంటాయని జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ శ్యామ తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు మండలంలో ఇంటింటా సర్వే చురుగ్గా సాగుతోంది. మంగళవారం కూడేరులో జరుగుతున్న ఇంటింటా సర్వేను ఆమె తనిఖీ చేశారు. సర్వే పక్కాగా చేపట్టాలని, ప్రత్యేక అవసరాల గల పిల్లలు, బడులకు దూరంగా ఉన్న పిల్లలు బడుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యేక అవసరాల గల పిల్లల తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. సాధారణ విద్యార్థులతో సమానంగా ప్రత్యేక అవసరాల , దివ్యాంగ పిల్లలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న పిల్లలకు ట్యాబ్‌లు అందజేస్తారన్నారు. ఉచితంగా అన్ని ఉపకరణాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ అలెస్కో గోవింద్ , ఐఈఆర్టీలు మస్తానయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అనంతపురం రూరల్: గర్భిణులు, బాలింతలు పోషక విలువతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం–1లో మాసిక మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు పండ్లు, కూరగాయాలతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారన్నారు. నెలసరి సమయంలో మహిళలు, యుక్త వయసు అమ్మాయిలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని, అలాగే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన మల్లేశ్వరస్వామి ఆలయంలో కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పురావస్తు శాఖ అధికారులు తెలిపారు. ఆలయ చరిత్ర తెలిసే విధంగా ప్రత్యేక సందర్శన బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం




చాబాలలో శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం , అలంకరణలో చెన్నకేశవస్వామి , అలంకరణలో అమ్మవారు

వజ్రకరూరు: మండలంలోని చాబాలలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో నవదశ వార్షికోత్సవం, స్వామి కల్యాణోత్సవం తదితర కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. ఆలయంలో గణపతి పూజ, స్వస్తిపుణ్యాహ వచనము, ప్రధాన కలశస్థాపన, నవగ్రహ ఆరాధన, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, ఉత్సవ మూర్తులకు అభిషేకం, అలంకారం, శ్రీగణపతి, శ్రీసూక్త పురుష సూక్త హవనములు తదితర కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం, అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఆలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా వీధుల గుండా ఊరేగించారు.